

అన్బుమణిపై వేటు

- అధ్యక్షుడిగా రాందాస్
- తారస్థాయికి తండ్రీకొడుకుల మధ్య యుద్ధం
- రాష్ట్రవ్యాప్తంగా అన్బుమణి మద్దతుదారుల నిరసన



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రాందాస్

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడిగా ఉన్న ఆయన కుమారుడు డాక్టర్ అన్బుమణి మధ్య నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరాయి. పార్టీ అధ్యక్ష పదవి నుంచి అన్బుమణిని డిస్మిస్ చేస్తున్నట్లు రాందాస్ ప్రకటించడమే ఇందుకు నిదర్శనం. వచ్చే యేడాది ఏప్రిల్, మే నెలల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్బుమణి ఆకస్మిక తొలగింపు పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ యేడాది ప్రారంభం నుంచి పార్టీ పదవుల నియామకాల విషయంలో అన్బుమణి, డాక్టర్ రాందాస్ మధ్య మనస్పర్థలు నెలకొన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా అన్బుమణి మేనల్లుడు ముకుందన్‌ను నియమించినప్పుడే ఇరువురి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. సభా వేదికపైనే రాందాస్ మాట్లాడుతూ.. పార్టీ వ్యవస్థాపకుడిగా ఉన్న తనకు పార్టీ వ్యవహారాలపై సర్వ హక్కులు ఉన్నాయని, పార్టీలో తన మాటకు తిరుగులేదని ప్రకటించుకున్నారు. ఆయన ప్రకటనతో తీవ్రంగా విభేదించినా, అప్పటికి అన్బుమణి మౌనం దాల్చారు. కొద్ది రోజులయ్యాక అన్బుమణి, రాందాస్ వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ యువజన విభాగం అధ్యక్షుడి నియామకం పార్టీ అంతర్గత విషయమని తెలిపారు. ముకుందన్ నియామకాన్ని అంగీకరించామని పేర్కొన్నారు. ఈ నెల 6న తైలాపురంలో రాందాస్ అధ్యక్షతన జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలోనూ అన్బుమణి తాను పేరుకు మాత్రమే అధ్యక్షుడిగా ఉన్నానని, పార్టీలో జరుగుతున్న నియామకాల గురించి సాధారణ కార్యకర్తలాగే వ్యవస్థాపకుడి ప్రకటనలు చూసి తెలుసుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం తైలాపురం గార్డెన్‌లో రాందాస్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్ష పదవి నుంచి అన్బుమణిని డిస్మిస్ చేశామని, ఇకపై ఆయన పార్టీ కార్యచరణ అధ్యక్షుడిగా కొనసాగుతారని ప్రకటించారు. అంతేకాకుండా పార్టీ అధ్యక్షుడిగా తానే కొనసాగుతానని పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు జీకే మణి పార్టీ గౌరవాధ్యక్షుడిగా ఉంటారని తెలిపారు. రాందాస్ చేసిన ఈ ప్రకటన పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. పలు చోట్ల అన్బుమణికి మద్దతుగా పార్టీ కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకో నిర్వహిస్తున్నారు.

పొత్తుపై భిన్నాభిప్రాయాలే కారణమా?



దిండివనంలో ధర్నా జరుపుతున్న పీఎంకే కార్యకర్తలు

వచ్చేయేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే అంశంపై అన్బుమణి, రాందాస్ మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాయని, ఆ నేపథ్యంలో అన్బుమణి డిస్మిస్ అయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం రాత్రి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలుసుకుని పొత్తును ఖరారు చేసుకోవాలని అన్బుమణి భావించారని, అయితే రాందాస్ పొత్తు విషయంపై అన్నాడీఎంకే నేతలతోనే సంప్రదింపులు జరపాలని పట్టుబడుతున్నారని పార్టీ సీనియర్ నేతలు పేర్కొన్నారు. ఈ పరిస్థితులలోనే అన్బుమణి దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేసేందుకే పార్టీ అధ్యక్షపదవి నుంచి తొలగిస్తున్నట్లు విలేకరుల సమావేశంలో రాందాస్ ప్రకటించారని పేర్కొంటున్నారు. ఇదిలా వుండగా అన్బుమణి తొలగింపును ఖండిస్తూ దిండివనంలో పార్టీ కార్యకర్తలు ధర్నా జరిపారు. రాందాస్ నివాసగృహం తైలాపురం గార్డెన్ సమీపంలో పార్టీ మాజీ నేత రాజేష్ నాయకత్వంలో సుమారు 30 మంది కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. ఇక పార్టీ కోశాధికారిగా ఉన్న తిలక్‌భామా అన్బుమణి తొలగింపును వ్యతిరేకిస్తూ ఓ సందేశం వెలువరించారు. అన్బుమణి డిస్మిస్ ఘోర తప్పిదమని, పార్టీ పతనానికి దారి తీస్తుందన్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారం పార్టీలో చీలకలకు దారి తీస్తుందని పీఎంకే నేతలు ఆందోళన చెందుతున్నారు.

నీట్‌పైనా విజయం సాధిస్తాం!

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం
- బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు
- సీఎం స్టాలిన్
- డీఎంకే కార్యకర్తలకు బహిరంగ లేఖ



సీఎంకు మహానాడు ప్రత్యేక సంచికను అందిస్తున్న సీపీఎం సీనియర్ నేతలు షణ్ముగం, కె.బాలకృష్ణన్. చిత్రంలో ఉదయనిధి

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు నుంచి డీఎంకే ప్రభుత్వం పొందుతున్న తీర్పులన్నీ అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజాస్వామ్యానికి వెలుగులు ప్రసాదిస్తాయని, గవర్నర్ అధికార పరిధులు ఏ మేరకు ఉన్నాయో కుండబద్దలు కొట్టినట్టు సర్వోన్నత న్యాయస్థానం వెలురించిన తీర్పు ఓ ఆరంభం మాత్రమేనని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ప్రకటించారు. నీట్ మినహాయింపు కేసులోనూ ఈ విజయపరంపర కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు స్టాలిన్ గురువారం పార్టీ శ్రేణులకు బహిరంగ లేఖ రాశారు. డీఎంకే చేపడుతున్న న్యాయపోరాటాలన్నీ విజయం సాధిస్తాయనే నమ్మకం తనకుందన్నారు. గవర్నర్‌కు సంబంధించిన కేసులో వెలువడిన తీర్పు రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాదని, అన్ని రాష్ట్రాల గవర్నర్లకు వర్తిస్తుందన్నారు. రాష్ట్ర గవర్నర్ బిల్లుల ఆమోదంపై హద్దులు అతిక్రమించారని సుప్రీంకోర్టు తేటతెల్లం చేసి మరీ రాష్ట్ర హక్కులను కాపాడేలా తీర్పు వెలువరించిందన్నారు. ఆ తీర్పు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమన్నారు. అన్ని అధికారాలు శాసనసభకే ఉన్నాయని, రాజ్‌భవన్‌కు లేవన్న విషయాన్ని కూడా సుప్రీం తీర్పు స్పష్టం చేసిందన్నారు.

బెదిరించినా లొంగం...

జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించకపోతే నిధులివ్వబోమని కేంద్ర మంత్రులే బెదిరించిన భయపడకుండా డీఎంకే ప్రభుత్వం తన సొంత నిధులతో ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలను చెల్లిస్తోందన్నారు. రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉన్నామని మరోమారు కేంద్రానికి సుస్పష్టంగా తెలియజేశామన్నారు. జనాభా నియంత్రణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు శిక్షగా ఆ జనాభా ప్రాతిపదికనే పునర్విభజన పేరుతో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం కుట్రపన్నిందనే విషయాన్ని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీల ప్రతినిధులతో ఏర్పాటైన ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం బట్టబయలు చేసిందన్నారు. పునర్విభజన వెనుక దాగి ఉన్న కేంద్రంలోని బీజేపీ పాలకుల కుట్రను తొలిసారిగా బహిర్గతపరచిన ఘనత డీఎంకేకు దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా కేంద్రప్రభుత్వం నిధులివ్వకుండా ఇబ్బంది పెట్టినా రాష్ట్రం ఆర్థికాభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకుందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెలువరించిన గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలకులు ఎన్ని కుయుక్తులు పన్నినా సర్వోన్నత న్యాయస్థానం ద్వారా రాష్ట్రానికి సానుకూలమైన తీర్పులు పొంది, ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా డీఎంకే న్యాయపోరాటం కొనసాగుతుందని స్టాలిన్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల మదురైలో జరిగిన తమ పార్టీ జాతీయ మహానాడులో పాల్గొన్నందుకు స్టాలిన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.బాలకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సచివాలయానికి వచ్చిన సీపీఎం నేతలు.. మహానాడులో ముద్రించిన ప్రత్యేక సంచికను సీఎంకు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కూడా పాల్గొన్నారు.

నేత్రపర్వం... మయిలం మురుగన్ రథోత్సవం



రథోత్సవంలో అశేష భక్తజనం

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని మయిలంలో ప్రసిద్ధిచెందిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం పంగుణి ఉత్తిర రథోత్సవం అశేష భక్తజనం నడుమ నేత్రపర్వంగా జరిగింది. పురాతనమైన ఈ ఆలయంలో అమ్మవార్ల సమేతంగా కొలువుదీరిన స్వామివారు భక్తులకు కల్యాణశోభతో దర్శనమిస్తుంటారు. ఈ ఆలయంలో పంగుణి ఉత్తిరై ఉత్సవాలు ఈనెల 2వ తేదీన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆ రోజునుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, ఉత్సవమూర్తుల ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం గురువారం నిర్వహించగా, మాజీమంత్రి సెంజిమస్తాన్, హిందూ దేవాదాయశాఖ అధికారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మయిలం ఆధీన పీఠాధిపతి శివజ్ఞాన బాలాలయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, తాడు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉదయం 5.46 గంటలకు కదిలిన రథం, ఉదయం 7 గంటలకు మైలం కొండచుట్టూ తిరిగి మళ్లీ ఆలయానికి చేరుకుంది. రథోత్సవంలో భక్తులు పాల్గొనేందుకు పలుప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. విల్లుపురం రవాణా విభాగం ఆధ్వర్యంలో మయిలంకు ప్రత్యేక బస్సులు నడిపారు. కాగా, రద్దీని దృష్టిలో వుంచుకుని విల్లుపురం ఎస్పీ శరవణన్ 300 మంది పోలీసులతో భద్రతా విధులు నిర్వహించారు.

మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టుల సంచారం?

- క్యూ బ్రాంచ్ పోలీసుల ముమ్మర కూంబింగ్



కూంబింగ్‌లో ప్రత్యేక క్యూ విభాగం దళం

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టుల సంచారం ఉందన్న అనుమానంతో రాష్ట్ర క్యూ బ్రాంచ్ పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ చేపడుతున్నారు. 2017లో కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా ఎడకరై అటవీ ప్రాంతంలో రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు ఆయుధ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. శిక్షణ జరుగుతున్న సమయంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల మావోయిస్టు వ్యతిరేక దళాలు చుట్టుముట్టాయి. ఆ సమయంలో ఇరువర్గాలు కాల్పులకు పాల్పడగా, మావోయిస్టులు తప్పించుకున్నారు. అనంతరం చెన్నైలో తలదాచుకున్న మన్నైపురం కార్తీక్, హోసూరులో సంతోష్‌కుమార్‌ను రాష్ట్ర క్యూ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో చెన్నై, కోవై, తేని, రామనాథపురం, సేలం, కన్నియాకుమారి, కృష్ణగిరి జిల్లాల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు రహస్య సమాచారం అందింది. అలాగే, కేరళ రాష్ట్రం వయనాడు, మలప్పురం, పాలక్కాడు ప్రాంతాలు, కర్ణాటక రాష్ట్రం ఉడిపి లో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన నీలగిరి ముచ్చసందిప్పు అటవీ ప్రాంతంలో క్యూ బ్రాంచ్ దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

వేసవిలో కోతలుండవు

- విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజి

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి సెంథిల్ బాలాజి తెలిపారు. కోయంబత్తూర్‌లో గురువారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యుత్ కోతలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అత్యవసర మరమ్మతులకు కొద్దిసేపు సరఫరాకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. వేసవిలో పెరగనున్న విద్యుత్ వినియోగానికి దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కొనుగోలు చేయనున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు బిల్లులను ఆమోదించిన వ్యవహారంలో రాష్ట్రానికే కాకుండా దేశానికి మార్గదర్శకంగా ముఖ్యమంత్రి స్టాలిన్ నిలిచారని కొనియాడారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని న్యాయపోరాటం చేశారన్నారు. ఇది ఒక చరిత్రాత్మక విజయంగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు.

ఉత్తర జిల్లాల్లో పెరగనున్న ఉష్ణోగ్రతలు

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, వేలూరు, రాణిపేట, చెంగల్పట్టు జిల్లాల్లో శుక్రవారం నుంచి ఐదు రోజుల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచే వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. మధ్యాహ్నం సమయంలో ఇళ్ల నుండి బయటికి రావాలంటేనే ప్రజలు భయపడేలా రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధ్యధికంగా నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పగటిపూట జాగ్రత్తగా వుండాలని ప్రైవేటు వాతావరణ నిపుణుడు ప్రదీప్ జాన్ సూచించారు. ఈ నేపథ్యంలో, శుక్ర, శనివారాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఉత్తర జిల్లాల్లో ఈ నెల 15వ తేదీ వరకు ఇదే పరిస్థితి నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. స్థానిక మీనంబాక్కంలో ఈ సంవత్సరం 40 డిగ్రీల సెల్సియస్, వేలూరు 41డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరికలు జారీ అయ్యాయి.

కడలూరు సమీపంలో రెండు బస్సుల ఢీ

- 30 మందికి తీవ్రగాయాలు



ప్రమాదస్థలంలో ధ్వంసమైన ప్రైవేటు బస్సు, పొలంలోకి జారిన రాష్ట్ర రవాణా సంస్థ బస్సు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. విల్లుపురం - నాగపట్టినం రహదారిలో ఆలపాక్కం వద్ద గురువారం వేకువజామున చెన్నై నుంచి నాగపట్టినంకు వెళుతున్న రాష్ట్ర రవాణా సంస్థ ఎక్స్‌ప్రెస్ బస్సును, కడలూరు నుండి ముత్తాండికుప్పానికి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సాక్కాన్‌కుడికి చెందిన ఉదయకుమార్, పూండియాంకుప్పంకు చెందిన అమృతవళ్ళి, తమిళరసి, అలమేలు, తిరుత్తురై పూండికి చెందిన ప్రకాష్, నవీన్‌రాజ్, కడలూరుకు చెందిన వాసుకి, వీరకుమార్, తిరుక్కువలైకి చెందిన లెనిన్, మేల్‌మలయనూరుకు చెందిన పచ్చయప్పన్, కుళ్లన్‌చావిడికి చెందిన పయ్యమ్మాళ్, కురింజిపాడికి చెందిన కదిర్‌వేల్, భువనగిరికి చెందిన రామ్‌కుమార్, సాత్తపాడికి చెందిన ఉదయకుమార్ సహా 30 మంది గాయపడ్డారు. వీరిని కడలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుదుసత్తిరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదం కారణంగా విల్లుపురం - నాగపట్టినం జాతీయ రహదారిలో సుమారు గంటకు పైగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రెండు బస్సులను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



కడలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్సలు

అట్టహాసంగా ఆరుప్పత్తుమువ్వర్ పెరువిళా

- మైలాపూరులో 63 మంది నాయన్మార్ల ఊరేగింపు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం మైలాపూరులోని కర్పగాంబాళ్ సమేత కపాలేశ్వరాలయ పంగుణి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'ఆరుప్పత్తుమువ్వర్ పెరువిళా' (63 మంది నాయన్మార్ల మహోత్సవాలు) గురువారం మధ్యాహ్నం కనులపండువగా సాగింది. అందమైన పల్లకీల్లో ఒకే సమయంలో 63 మంది నాయన్మార్లు సర్వాలంకరణ శోభితులై ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. ఈ వేడుకలకు గాను ఆలయ మహామండపం వద్ద ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ వేదపండితులు మంత్రోచ్చాటనల నడుమ పల్లకీల్లో నాయన్మార్ల ఉత్సవమూర్తులను ఆశీనుల కావించారు. ఆ తర్వాత నాయన్మార్లకు కర్పూర హారతులిచ్చి ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో కొన్ని శైవాలయాల్లో నాయన్మార్ల ఉత్సవాలు జరిగినా, మైలాపూరు క్షేత్రంలో యేటా నిర్వహించే ఈ ఉత్సవాలే అంతర్జాతీయంగా ఖ్యాతిని గడించాయి. ఇంతటి కీర్తిని సంతరించుకున్న నాయన్మార్ల ఊరేగింపు వేడుక గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైంది. నాయన్మార్ల విగ్రహాలున్న పల్లకీలను మోయడానికి భక్తులు పోటీపడ్డారు. రెండు వరుసలుగా నాయన్మార్ల పల్లకీలను ఊరేగించారు.



మైలాపూరు రామకృష్ణమఠం రోడ్డులో భక్తజనం నడుమ ఊరేగుతున్న నాయన్మార్లు

సమాచార దర్శిని

రేపు వాటర్ బోర్డు గ్రీవెన్స్

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో వాటర్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 12న శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కారం శిబిరాలు జరుగనున్నాయి. మండల వాటర్ బోర్డు కార్యాలయాల్లో పర్యవేక్షణ ఇంజనీర్ నేతృత్వంలో జరిగే శిబిరాల్లో, పన్ను, ఛార్జీలు, కొత్త కనెక్షన్లకు సంబంధించి వినతిపత్రాలు సమర్పించి పరిష్కారం పొందవచ్చు. అలాగే, వాననీటి సేకరణ, పర్యవేక్షణకు సంబంధించి సలహాలు, సూచనలు అందించవచ్చని వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్, వ్యాసర్పాడి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరాలు జరగనున్నాయి. టి.నగర్ పరిధిలో వళ్లువర్‌కోట్టం సమీపంలోని ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, వ్యాసర్పాడి పరిధిలో వ్యాసర్పాడి రామలింగర్ ఆలయ సమీపంలోని ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించే శిబిరాల్లో విద్యుత్ వినియోగదారులు పాల్గొని, ఛార్జీలు, కనెక్షన్లు, విద్యుత్ కోతలపై వినతిపత్రాలు సమర్పించి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఎంబ్రాయిడరీపై ఉచిత శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'థాడ్కో' ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన యువకులకు ఉచితంగా ఎంబ్రాయిడరీ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ యువకులకు చెన్నై వేళచ్చేరిలోని వివేషియస్ అకాడమీ, థాడ్కో సంయుక్తంగా 'డిప్లొమా ఆరి ఎంబ్రాయిడరీ', వస్త్రాలపై చేతి ఎంబ్రాయిడరీలో శిక్షణ అందించనున్నాయి. టెన్త్, ప్లస్ టూ ఉత్తీర్ణులై 18-30 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నెలరోజుల పాటు జరగనున్న శిక్షణలో పాల్గొనే అభ్యర్థులకు బస వసతి, శిక్షణ పరికరాలు, ఆహారం తదితరాలు థాడ్కో అందిస్తుంది. www.tahdco.comలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విద్యార్థులు రాణించేలా వారికి తగిన శిక్షణ ఇచ్చేలా రాష్ట్రంలో ఆరు స్పోర్ట్స్ హాస్టళ్లు పని చేస్తున్నాయి. స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు (ఎస్డీఏటీ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ హాస్టళ్లలో వివిధ క్రీడలపై శిక్షణ, బస, పౌష్టికాహారం తదితరాలు అందించనున్నారు. విద్యార్థులకు క్రీడా శిక్షణతో పాటు విద్య అభ్యసించవచ్చు. ఈ కేంద్రాల్లో 6, 7, 8 తరగతుల్లో చేరే విద్యార్థులు 13 ఏళ్లు పూర్తయినవారై ఉండాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.sdat.tn.gov.inలో ఈ నెల 30వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. అథ్లెటిక్స్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో శిక్షణకు విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ తదితరాలకు విద్యార్థులు, టెన్నిస్ క్రీడలో విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి మే 2వ తేది సంబంధిత క్రీడా ప్రాంతాల్లో సంబంధిత క్రీడా సామర్థ్యాలను పరిశీలించి అడ్మిషన్లు కల్పించనున్నారు.వివరాలకు నెం.9514 000777లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

నేడు టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పనయూర్‌లోని టీవీకే పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శుల సమావేశం జరుగనుంది. పార్టీ అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలో జరుగనున్న సమావేశంలో బూత్ కమిటీ నిర్వాహకుల ఎంపిక, ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తులో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఎన్నికల నిర్వహణ విభాగం జనరల్ సెక్రటరీ ఆధవ్ అర్జున తదితరులు పాల్గొంటారని పార్టీ తెలియజేసింది.

పెరిగిన పూల ధరలు

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌లో పూల ధరలు పెరిగాయి. శుక్రవారం పంగుణి ఉత్తిరం సందర్భంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కిలో మల్లెలు రూ.400 నుంచి రూ.600, ఐస్‌మల్లెలు రూ.300 నుంచి రూ.400, ముల్లై రూ.400 నుంచి రూ.750, జాజిమల్లి రూ.450 నుంచి రూ.750, కనకాంబరాలు రూ.300 నుంచి రూ.500, చామంతి రూ.60 నుంచి రూ.180, సంపంగి రూ.150 నుంచి రూ.240, చాక్లెట్ రోజ్ రూ.120 నుంచి రూ.160, పన్నీర్‌రోజ్ రూ.80 నుంచి రూ.120కి విక్రయమయ్యాయి.

మహావీర్ జయంతి వేడుకలు

వేలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జైన మతస్థుల ఆరాధ్య దైవం వర్ధమాన మహావీర్ జయంతిని వేలూరులోని సంభవానంద జైన్ ఆలయంలో గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. లోకశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం 6గంటలకు మహావీర్ జైన్ విగ్రహమూర్తిని ఊరేగించారు. ఈ ఊరేగింపులో శ్రీజైన్ మహాసభ సంఘాలు సహా జైనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్ధమాన మహావీరుడు జైనమతాన్ని పునరుద్ధరించిన 24వ తీర్థంకరుడని తెలిపారు. ఆయన జయంతిని మతసామరస్యాన్ని చాటేలా జరుపుకోవడం మహాభాగ్యమన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

తిరుత్తణి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని పోదట్టూరుపేట, పల్లిపట్టుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం కలెక్టర్ ఎం.ప్రతాప్ పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శరవణన్, ఏరియా డెవలెప్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ముంబై విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ముంబైకి బయల్దేరాల్సిన విమానంలో తలెత్తిన సాంకేతికలోపాన్ని పైలెట్ సకాలంలో గుర్తించడంతో ప్రమాదం తప్పింది. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి గురువారం తెల్లవారుజామున 4.55 గంటలకు ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం 182 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బందితో సిద్ధంగా ఉంది. విమానం రన్‌వేపై తీసుకెళ్లే ముందు పైలెట్ విమానాన్ని పరిశీలించి యంత్రంలో సాంకేతికలోపం తలెత్తినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని విమానాశ్రయ అధికారులకు తెలియజేశారు. ఇంజనీరింగ్ నిపుణులు విమానాన్ని పరిశీలించి సాంకేతిక లోపం సరిచేయడంతో, ఒకటిన్నర గంట ఆలస్యంగా విమానం బయల్దేరి వెళ్లింది.

మాజీ మంత్రి వీరపాండి ఆర్ముగం కుటుంబానికి
హైకోర్టులో చుక్కెదురు

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసు నుంచి దివంగత డీఎంకే మాజీమంత్రి వీరపాండి ఆర్ముగం కుటుంబాన్ని విడుదల చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. డీఎంకే అధ్యక్షుడు, మాజీ సీఎం కరుణానిధి నేతృత్వంలో 1996 నుంచి 2001వ సంవత్సరం వరకు అధికారంలో ఉన్న రాష్ట్రప్రభుత్వంలో వీరపాండి ఆర్ముగం వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించారు. అప్పుడాయన ఆదాయానికి మించి అధికంగా రూ.1,80,85,600 కూడబెట్టారని ఆ తర్వాత అధికారం చేపట్టిన అన్నాడీఎంకే హయాంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆర్ముగం సతీమణులు రంగనాయకి, లీల, కుమారులు నెడుంజెలియన్, రాజేంద్రన్, కుమార్తె నిర్మల, కోడళ్లు బృందా, శాంతిని కూడా ఈ కేసులో చేర్చారు. ఈ నేపథ్యంలో అక్రమార్జన కేసు నుంచి తమ కుటుంబాన్ని విడిపించాలని కోరుతూ, వీరపాండి ఆర్ముగం తరుపున దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సేలం ప్రత్యేక కోర్టు 2006వ సంవత్సరం అందరినీ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన అప్పీలు కేసులు మద్రాస్ హైకోర్టులో సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉండగా, 2012లో మాజీమంత్రి వీరపాండి ఆర్ముగం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. దీంతో అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం తరుపున సుప్రీంకోర్టులో దాఖలైన అప్పీలు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం అక్రమార్జన కేసులో ప్రధాన ముద్దాయిగా చేర్చిన వీరపాండి ఆర్ముగం మరణించినప్పటికీ, మిగతా వారిపై నమోదైన కేసుపై మద్రాస్ హైకోర్టు విచారణ జరపాలని 2015లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా ఆర్ముగం పెద్దకుమారుడు నెడంజెలియన్ కూడా మృతిచెందడంతో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు మిగతా వారిని విడుదల చేస్తూ సేలం కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వ్యతిరేకంగా కేసు నమోదు చేయడంతో పాటు సాక్షులను విచారించాల్సిందిగా హైకోర్టు సేలం కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

రేపు గుడిమెట్ల, మాడభూషికి సత్కారం

చెన్నై, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించినందుకు ఇటీవల ఏపీ ప్రభుత్వంనుంచి ఉగాది పురస్కారాలు అందుకున్న జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌ను శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. మైలాపూర్ లజ్‌లో ఉన్న అమరజీవి స్మారక మందిరంలో సాయంత్రం 5 గంటలకు జరగనున్న ఈ సత్కార కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. కమిటీ సభ్యులు నారాయణగుప్తా స్వాగతం పలుకనున్న ఈ కార్యక్రమాన్ని ఆచార్య విస్తాలి శంకరరావు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా డి.తిరుమల స్వాతి విరచిత 'మాడభూషి కవిత్వానుశీలన' పుస్తకావిష్కరణ జరగనుంది. చివరిగా ఎంఆర్ సుబ్రహ్మణ్యం బృందంతో 'గానలహరి', అనంతరం సాయంత్రం 7 గంటలకు విందు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

హైకోర్టులో కేంద్రప్రభుత్వ సీనియర్ కౌన్సిల్‌గా
రవీంద్రనాథ్ నియామకం



చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టులో కేంద్రప్రభుత్వ కేసులు వాదించేందుకు సీనియర్ కౌన్సిల్‌గా తెలుగు ప్రముఖుడు కె.రవీంద్రనాథ్ నియమితులయ్యారు. మద్రాస్ హైకోర్టు, మదురై ధర్మాసనం, చెన్నైలోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో తమ తరపున కేసులు వాదించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల న్యాయవాదులను నియమించింది. ఇందులో భాగంగా సీనియర్ ప్యానెల్ కౌన్సిల్‌గా కె.రవీంద్రనాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేసిన రవీంద్రనాథ్.. ఆ తరువాత మద్రాస్ లా కళాశాల నుంచి పట్టా పొందారు. 1983లో తమిళనాడు బార్ కౌన్సిల్‌లో ఎన్రోల్‌మెంట్ తీసుకున్న ఆయన.. వివిధ కీలకమైన కేసుల్లో వాదించారు. సివిల్ సూట్, బ్యాంకులు, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, సర్వీస్ ట్యాక్స్ తదితర విభాగాల్లో కేసులు వాదించారు. గతంలోనూ మద్రాస్ హైకోర్టులో కేంద్రప్రభుత్వ సీనియర్ ప్యానెల్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అదేవిధంగా టీటీడీ తరఫున, యూజీసీ, ఏఐసీటీఈ, ఇండియన్ రైల్వే, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ కేసులను కూడా వాదించారు. పలు బ్యాంకుల్లో ప్యానెల్ అడ్వకేట్‌గానూ వ్యవహరించారు.

విజయ్ మంచి నటుడు... రాజకీయాల్లో కాదు!

● మంత్రి గాంధీ



స్థానిక కొళత్తూర్ ప్రజలకు అల్పాహారం అందజేస్తున్న మంత్రులు గాంధీ, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి తదితరులు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విజయ్ మంచి నటుడు... రాజకీయాల్లో కాదని చేనేత శాఖ మంత్రి గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా చెన్నై తూర్పు జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో 'మక్కల్ ముదల్వరిన్ మనిదనేయ విళా' నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కొళత్తూర్ పడమర ఆధ్వర్యంలో అగరం చెంగల్వరాయన్ వీధి, జీకేఎం కాలనీ తదితర ప్రాంతాల్లో అల్పాహారం పంపిణీలో మంత్రులు గాంధీ, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గాంధీ మాట్లాడుతూ... రాష్ట్ర హక్కుల కోసం పోరాడి విజయం సాధించిన సీఎం స్టాలిన్ దేశానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. నీట్ వ్యవహారంలో నటుడు విజయ్ వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ... ఆయన ఎన్నో ఏళ్లుగా నటిస్తున్నారు. మంచి నటుడు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరు. ఆయన ప్రజలకు ఏం చేశారో చెప్పండి. ఆ తర్వాత నేను విజయ్ వ్యాఖ్యలకు బదులిస్తాను అంటూ మంత్రి తెలిపారు.

ఓఎమ్మార్ అపోలో హాస్పిటల్‌లో
16 ఏళ్ల సైక్లిస్ట్‌కు మోకాలి శస్త్రచికిత్స



సైక్లిస్ట్ సంజయ్, అతడి తండ్రితో అపోలో హాస్పిటల్ వైద్య నిపుణులు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓఎమ్మార్ అపోలో హాస్పిటల్‌లో 16 యేళ్ల బాలుడికి అరుదైన మోకాలి బంతిగిన్నె ఎముక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ వెంకటరమణన్ సామినాథన్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం చెన్నై ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంజయ్ అనే 16 యేళ్ల సైక్లిస్టు రోడ్డు ప్రమాదంలో కుడి మోకాలి కీలు బంతిగిన్నెకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చేరాడన్నారు. అతడి మోకాలి కీలు నుంచి బంతిగిన్నె కీలు పూర్తిగా తొలగిన స్థితిలో ఉండటంతో అరుదైన శస్త్రచికిత్స జరిపినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్లు మధుమిత, నిఖిల్, ప్లాస్టిక్ సర్జన్ కుమరేశన్ సహకరించారని తెలిపారు. ఆపరేషన్ తర్వాత సంజయ్ మునుపటిలా వేగంగా సైకిలు నడిపే స్థితికి చేరుకున్నాడని చెప్పారు. ఇటీవల ఒడిశాలో జరిగిన 16 యేళ్లలోపు బాలుర విభాగం సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని వెండి పతకాన్ని కూడా గెలుచుకున్నాడని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు రూ 3.5లక్షలు ఖర్చవుతుందని తెలిపారు.

మెరీనా సర్వీస్ రోడ్డులో
'షేడ్ హౌస్'



షేడ్ హౌస్ నిర్మాణంలో కార్మికులు

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల కూర్చొనేలా మెరీనా సర్వీస్ రోడ్డులో ఇనుప మండపాలు ఏర్పాటుచేయగా, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ క్రమంలో, ప్రస్తుతం పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా చెన్నై కార్పొరేషన్ మెరీనా సర్వీస్ రోడ్డులోని మూడు ప్రాంతాల్లో పండ్ల ఆకారంలో సీట్లు ఏర్పాటు చేసింది. ఈ విషయమై కార్పొరేషన్ అధికారి మాట్లాడుతూ... మెరీనా సర్వీసు రోడ్డులో 'స్ట్రాబెర్రీ' పండు ఆకారంలో 'షేడ్ హౌస్'లు ఏర్పాటు చేయనున్నామన్నారు. తొలివిడతగా మూడు ప్రాంతాల్లో తలా రూ.2 లక్షలో షేడ్ హౌస్ నిర్మాణాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

పళని ఆలయంలో నాలుగు రోజులు
బంగారం రథం సేవల రద్దు

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయంలో ఈనెల 10న గురువారం నుంచి నాలుగు రోజులు బంగారం రథం సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. పళని ఆలయానికి సాధారణ రోజుల్లో వేలాది మంది, విశేష, ఉత్సవ రోజుల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయంలో శుక్రవారం పంగుణి ఉత్తిరం ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్య లో తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో, బంగారు రథం సేవలు నాలుగు రోజులు నిలిపివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

13న ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమావేశం



వేలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు రమేష్ పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహించబోతున్నామని, దీనికి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నూతన వక్ఫ్‌చట్టం రాజ్యాంగ వ్యతిరేకం



వేలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో నూతనంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వేలూరులో గురువారం ఉదయం విడుతలై చిరుతైగల్ కట్చీ (వీసీకే) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ముస్లింల ఆస్తులను దోచుకోవాలన్న ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉపకార్యదర్శి వివేక్, జ్ఞానశేఖరన్, శివజ్ఞానం, సుందరమూర్తి సహా 200మందికి పైగా ఇస్లామీయులు పాల్గొని నిరసనలో పాల్గొన్నారు.

అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ నేడు కాంగ్రెస్ నిరసన

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ మేరకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం, రాష్ట్రానికి నిధులు అందించడంలో పక్షపాతం చూపుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రానికి రానున్న కేంద్ర మంత్రి అమిత్‌షా కు వ్యతిరేకంగా మైలాపూర్‌లో నల్లజెండాలు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సెల్వపెరుందగై తెలిపారు.

కన్నియాకుమారి, కోవైకు ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళ 'ఉగాది, గుడ్‌ఫ్రైడే', ఈస్టర్ పండుగలు జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం దక్షిణ రైల్వేశాఖ కన్నియాకుమారి, కోవై, కొల్లం ప్రాంతాలకు ప్రత్యేక రైళ్ల సేవలను గురువారం ప్రారంభించింది. ఆ శాఖ విడుదల చేసిన టైమ్‌టేబుల్ ప్రకారం, చెన్నై సెంట్రల్ నుంచి ఏప్రిల్ 10 (గురువారం), 17వ తేదీల్లో రాత్రి 7గంటలకు బయలుదేరే నెం.06089 ప్రత్యేక రైలు శుక్రవారం ఉదయం 10గంటలకు చేరుకుంటుంది. మరోమార్గంలో అక్కడినుండి 11, 18 తేదీల్లో రాత్రి 8గంటలకు బయలుదేరే నెం06090 ప్రత్యేక రైలు మరుసటిరోజు 11 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుతుంది. 12 స్లీపర్ కోచ్‌లు, 6 ఆర్డినరీ కోచ్‌లు కలిగిన ఈ రైలు అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, నామక్కల్, కరూర్, దిండుగల్, మదురై, విరుదునగర్, సాతూర్, కోవిల్‌పట్టి, తిరునల్వేలి, నాగర్‌కోవిల్ మీదుగా పయణిస్తుంది.

12, 19 తేదీల్లో... :చెన్నై సెంట్రల్‌నుంచి ఈ నెల 12, 19తేదీల్లో రాత్రి 11.20గంటలకు బయలుదేరే నెం.06113 ప్రత్యేక రైలు మరుసటిరోజు 3గంటలకు కేరళ రాష్ట్రంలోని కొల్లంకు చేరుకుంటుంది. మరోమార్గంలో అక్కడినుండి ఈ నెల 13, 20 తేదీల్లో రాత్రి 7.10 గంటలకు బయలుదేరే నెం06114 రైలు మరుసటిరోజు ఉదయం11గంటలకు చెన్నై సెంట్రల్‌కు వచ్చి చేరుతుంది. 11 స్లీపర్ కోచ్‌లు, 13 ఆర్డినరీ కోచ్‌లు ఉన్న ఈ రైలు అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పోతనూర్, పాలఘాట్, తిరుచ్చూర్,ఎర్నాకులం, కొట్టయం, చెంగనూర్, మావెలికారన్‌ల మీదుగా పయణిస్తుంది. సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం (ఏప్రిల్ 11) రాత్రి 11.50 గంటలకు బయలుదేరే నెం. 06027 నెంబరు గల రైలు మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు కోవై సమీపంలోని పోతనూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో అక్కడినుండి ఈనెల 14వతేదీ రాత్రి 11.30గంటలకు బయలుదేరే నెం06027 ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 8గంటలకు చెన్నైసెంట్రల్‌కు వచ్చిచేరుతుంది. ఈ రైలు పెరంబూర్, తిరువళ్లూరు, అరక్కోణం, కాట్పాడి, సేలం, తిరుప్పూర్ మీదుగా వెళుతుంది.

తాంబరం నుంచి.... : తాంబరం నుంచి ఈ నెల 11, 18, 25, మే 2వ తేదీలలో సాయంత్రం 5.05గంటలకు బయలుదేరే 06185 అనే ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 7.45 గంటలకు పోతనూర్ చేరుతుంది. మరోమార్గంలో అక్కడినుండి ఈ నెల 13, 20, 27 మే 4వ తేదీల్లో రాత్రి 11.55 గంటలకు బయలుదేరే నెం06186 రైలు మరుసటిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు తాంబరం వచ్చిచేరుతుంది. మంగళూరు నుండి ఏప్రిల్ 10, 17వ తేదీల్లో సాయంత్రం 6గంటలకు బయలుదేరే నెం06051 రైలు మరుసటిరోజు 6.15 గంటలకు త్రివేండ్రం చేరుకుంటుంది. మరోమార్గంలో అక్కడినుండి 11, 18 తేదీల్లో సాయంత్రం 6.45గంటలకు బయలుదేరే నెం.06052 రైలు మరుసటిరోజు ఉదయం 7.గంటలకు మంగళూరు చేరుకుంటుందని దక్షిణ రైల్వేశాఖ అధికారులు తెలిపారు.

మరమగ్గాల కార్మికులను ఆదుకోండి

● ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరవధిక సమ్మె బాట పట్టిన మరమగ్గాల కార్మికుల జీవనాధారాన్ని ఆదుకునేలా చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఈపీఎస్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడదల చేసిన ప్రకటనలో తిరుప్పూర్, కోవై జిల్లాల్లో సుమారు 1.50 లక్షలకు పైగా మరమగ్గాల కార్మికులు నివసిస్తున్నారని, వారి పరిశ్రమల యూనిట్లకు మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు, పరిశ్రమల పన్ను, ఆస్తుల పన్ను పెంచడంతో ఆర్థిక భారం పెరిగి వందలాది పరిశ్రమలు మూతబడ్డాయన్నారు. మరోవైపు మరమగ్గాల యూనిట్లలో పనిచేస్తున్న కార్మికులు వేతనం పెంపులేక, ఇతర కారణాలవల్ల వారి కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈపీఎస్ ఆవేదన వ్యక్తంచేశారు. మరమగ్గాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు జరిపిన చర్చలు ఫలించకపోవడంతో లక్షలాది మంది కార్మికుల జీవనాధారం ప్రశ్నార్థకమైందని, ఇప్పటికైనా ఈ కార్మికులను ఆదుకునేందుకు డీఎంకే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా ఈపీఎస్ డిమాండ్ చేశారు.

తమిళ యువకుడితో వియత్నాం యువతి ప్రేమవివాహం



వధూవరులు మహేష్, నుయెన్ లే తూయ్

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమిళ సంస్కృతీ సంప్రదాయాలపై ఆసక్తి కలిగిన వియత్నాం యువతి తమిళ యువకుడిని ప్రేమించి తమిళ సంప్రదాయ రీతిలో వివాహం చేసుకుంది. తిరునల్వేలికి చెందిన మహేష్ (35) డిగ్రీ చదివి వియత్నాంలోని ఓ ఐటీ సంస్థలో పనిచేశాడు. ఆ సంస్థలోనే పనిచేస్తున్న నుయెన్ లే తూయ్‌తో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. నాలుగేళ్లు ప్రేమించుకున్న తర్వాత ఇరువైపు కుటుంబీకుల ఆమోదంతో పెళ్లికి సిద్ధమయ్యారు. వధువు కోరిక మేరకు తమిళ సంప్రదాయరీతిలో వీరి వివాహం తిరునల్వేలి కుట్రాలం రోడ్డులోని కల్యాణమండపంలో అట్టహాసంగా జరిగింది. వియత్నాం నుంచి వచ్చిన వధువు తరపు కుటుంబీకులంతా తమిళ సంప్రదాయ దుస్తులైన పట్టుచొక్కా, పట్టు ధోవతి, పట్టు చీరలు ధరించి కల్యాణమండపం అంతటా సందడి చేయడం కొసమెరుపు.

పరీక్షల భయంతో టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పరీక్షల భయంతో టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుండ్రత్తూరు అంకాలమ్మ ఆలయవీధిలో హార్డ్‌వేర్ దుకాణం నడుపుతున్న బాలాజి కుమార్తె దివ్యదర్శిని(15) ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుంది. సమాచారం అందుకుని ఇంటికి తిరిగొచ్చిన తల్లిదండ్రులు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని కుండ్రత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టెన్త్ పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయన్న భయంతోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినప్పటికీ మిగతా కోణాల్లో కూడా విచారణ జరుపుతున్నారు.

నామక్కల్ ఎంపీ ఇంట్లో అగ్నిప్రమాదం

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ కాంగ్రెస్ ఎంపీ వి.ఎస్. మాదేశ్వరన్ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. దీనిపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లుపై నిర్వహించిన ఓటింగులో మాదేశ్వరన్ పాల్గొనని నేపథ్యంలో ఆయన ఎంపీ పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తూ నామక్కల్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గంలో అంటించిన పోస్టర్లు కలకలం రేపాయి. ఇదిలా వుండగా సేందమంగళం సమీపంలోని మాదేశ్వరన్ ఇంట్లో ఆయన తల్లి వరుత్మళ్ (75) నివసిస్తున్నారు, బుధవారం అర్ధరాత్రి సుమారు 12గంటలకు ఆ ఇంటి నుంచి మంటలు వ్యాపించడం చూసిన ఇరుగుపొరుగు వారి సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆ మంటలు ఆర్పివేశారు. ఆ ప్రమాదంలో ఇంట్లోని ఏసీ పరికరం సహా ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. అయితే అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎంపీ లేరని పోలీసులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయాలు



తిరుత్తణి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జైనుల ఆరాధ్యదైవం వర్ధమాన మహావీర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉద యం నుంచే జైన ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు జరిగాయి. ఇదిలా వుండగా రాష్ట్రముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మహావీర్ జయంతి సందర్భంగా జైన మతస్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈరోజున మాంసం విక్రయాలను నిషేధిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నిబంధనను అతిక్రమించి బుధవారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మెట్టువీధి, గాంధీనగర్, అరక్కోణం రోడ్డు తదితర ప్రాంతాల్లో మాంసం విక్రయదారులు యథేచ్ఛగా అమ్మకాలు జరిపారు. దీనిపై అక్కడి స్థానిక ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ మాంసం దుకాణాలపై చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు తెలిపారు.


పోలీస్‌స్టేషన్ ముందు యువతి ఆత్మహత్య
వీఆర్‌కు నడుకావేరి ఎస్ఐ

పెరంబూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమ్ముడిని పోలీసులు అరెస్ట్ చేయడంతో పోలీస్‌స్టేషన్ ముందు విషం తాగి యువతి మృతి చెందిన వ్యవహారంలో ఎస్ఐను వీఆర్‌కు (వేకంట్ రిలీవ్) పంపారు. తంజావూరు సమీపంలో యువకుడిని ఓ కేసు విషయంపై విచారణకు నడుకావేరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి సోదరీమణులు కీర్తన (28), మేనక (31) పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, తమ తమ్ముడు ఎలాంటి తప్పు చేయలేదని తెలిపినా వారు పట్టించుకోలేదు. దీంతో ఇద్దరు స్టేషన్ ముందు విషం తాగారు. వారిని తంజావూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మేనక మృతిచెందగా, కీర్తన పరిస్థితి విషమంగా ఉన్న విషయం విదితమే. దీనిపై విచారణ చేపట్టిన తహసీల్దార్, ఈ వ్యవహారానికి సంబంధించి ఎస్ఐ షర్మిల, ఏఎస్ఐ అరివళగన్, కానిస్టేబుల్ మణిమేఘలై తదితరులపై చర్యలు చేపట్టాలని నివేదించారు. ఈ వ్యవహారంలో ఎస్ఐను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రాజరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టడం ఉద్రిక్తత దారితీసింది. ఈ ఘటన కారణంగా మేనక మృతదేహానికి ఇంకా పోస్టుమార్టం నిర్వహించలేదు.

రైలు కిందపడి ప్రేమజంట ఆత్మహత్య

వేలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దలు తమ ప్రేమను ఒప్పుకోలేదని ప్రేమికులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన వేలూరు జిల్లా కాట్పాడి మండలం లత్తేరి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది లత్తేరి సమీపంలోని పట్టియూర్‌కి చెందిన 34ఏళ్ళ ఓ యువకుడు, 27ఏళ్ల యువతి ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత ఏడాది ఈ విషయం వారి తల్లిదండ్రులకు తెలపగా, వారు అందుకు అంగీకరించలేదు. దీంతో కొద్దికాలం వేచివుండి వారిని ఒప్పించి పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. కానీ ఏన్నేళ్ళు గడిచిన వారి కుటుంబ సభ్యులు కులాలు వేరనే కారణంతో వివాహానికి ఒప్పుకోలేదు. దీంలో మనస్తాపానికి గురైన వారు లత్తేరి రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పోలీసుల పనితీరు అభినందనీయం : ఎస్పీ మదివానన్



వేలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు జిల్లా ఎస్పీ మదివానన్ ఆధ్వర్యంలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న పోలీసు వ్యవస్థకు సమాజంలో ఎంతో గౌరవమర్యాదలున్నాయన్నారు.

ప్రకృతితో మమేకమవుదాం

తమిళ చిత్రజ్యోతి

● రకుల్ ప్రీత్



ప్రకృతితో మమేకమైతే జీవితం ఆనందకరంగా సాగుతుందని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. తమిళం, తెలుగు, హిందీ తదితర భాషా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ... 'ఆరోగ్యకరమైన, శ్రద్ధతో కూడిన ఎంపికలతో మిమ్మల్ని మీరే ఉత్సాహపరుచుకోండి. ప్రకృతితో మమేకమైతే మీ జీవితం ఆనందకరంగా సాగిపోతుంది. మీకు నచ్చిన క్రీడను ఆడండి. మిమ్మల్ని మీరు శాంతపరచుకునేందుకు ధ్యానం చేయండి. ఒక రోజులో కేవలం 5 నిమిషాలు మాత్రమే మీ జీవితంలో కొత్త మార్పులు తీసుకొస్తాయి. అందువల్ల సంతోషకరంగా, నవ్వుతూ బతికేయండి. సంతోషం, ఆనందమే జీవితానికి ఆరోగ్యకరమైన మార్గాలు' అని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రజనీకాంత్

'జైలర్-2' సాఫీగా సాగుతోంది

● రజనీకాంత్

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తాను నటిస్తున్న 'జైలర్-2' షూటింగ్ సాఫీగా సాగిపోతోందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. జైలర్ రెండో భాగం షూటింగ్ కోసం కోయంబత్తూరుకు వెళ్లేందుకు ఆయన గురువారం చెన్నై ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'జైలర్-2' షూటింగును ఇప్పటికే ప్రారంభించగా, ఇది సాఫీగా సాగిపోతోంది. అజిత్ కుమార్ హీరోగా నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీకి నా బెస్ట్ విషెస్. గాడ్ బ్లెస్. ప్రముఖ సాహిత్యవాది కుమరిఅనంత్ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నా. ఆయన ఒక స్వచ్ఛమైన రాజకీయ నేత. మంచి వ్యక్తి. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.

ఇసైజ్ఞాని కాదు... గాడ్ ఆఫ్ మ్యూజిక్

● సీమాన్



ఆడియో రిలీజ్ దృశ్యం

సంగీత దర్శకుడు ఇళయరాజాపై ప్రముఖ సంగీత దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇళయరాజా సంగీత మేధావి కాదని, ఆయన సంగీత దేవుడని వ్యాఖ్యానించారు. ఈశ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై కామాక్షి జయకృష్ణన్ నిర్మాణ సారథ్యంలో ఇళయరాజా సంగీత దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పేరన్బుమ్ - పెరుం కోబముమ్'. దర్శకుడు కరు పళనియప్పన్ అసిస్టెంట్ శివప్రకాష్ దర్శకత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు తంగర్ బచ్చాన్ కుమారుడు విజయ్ బచ్చాన్ హీరోగా నటించారు. షాలి హీరోయిన్. ఇతర పాత్రల్లో మైం గోపి, అరుళ్‌దాస్ తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ వేడుక చెన్నైలో జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శకులు ఎస్.ఏ.చంద్రశేఖర్, ఆర్.వి.ఉదయకుమార్, ఆర్.కన్నన్, సుశీంద్రన్, సీమాన్, వసంత్ బాలన్, తిరుమలై, కరు పళనియప్పన్, తంగర్ బచ్చాన్, నటి దేవయాని తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇందులో సీమాన్ మాట్లాడుతూ... 'చిత్రపరిశ్రమలో కొత్తవారికి అవకాశం ఇవ్వడం అంటే గొప్ప విషయం. ఆ విషయంలో నిర్మాత జయకృష్ణన్ సఫలీకృతులయ్యారు. హీరో విజయ్‌బచ్చాన్‌కు తొలి చిత్రంలోనే మంచి కథాపాత్రలో నటించే గొప్ప అవకాశం లభించడంతోపాటు ఇసైజ్ఞానితో కలిసి పని చేసే భాగ్యం దర్శకుడు శివప్రకాష్‌కు లభించింది' అని అన్నారు.



'డీడీ నెక్స్ లెవల్'లో ఓ దృశ్యం

మే 16న సంతానం 'డీడీ నెక్స్ట్ లెవల్' విడుదల

2016వ సంవత్సరంలో సంతానం హీరోగా నటించి విడుదలైన చిత్రం 'దిల్లుక్కు దుడ్డు' (డిడి) ఘన విజయం సాధించింది. 2019లో వచ్చిన రెండో భాగం కూడా సూపర్ హిట్టే. ఆ తర్వాత 2023లో ప్రేమ్‌ఆనంద్ దర్శకత్వంలో 'డిడి రిటర్న్స్'లో సంతానం నటించారు. ఇపుడు ప్రేమ్‌ఆనంద్ దర్శకత్వంలో సంతానం నటించిన 'డీడీ నెక్స్ట్ లెవల్' మూవీ నిర్మాణం పూర్తి చేసుకోగా, మే 16న విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఇందులో గౌతం వాసుదేవ మీనన్, సెల్వరాఘవన్, కస్తూరి, మొట్టై రాజేంద్రన్, యాషికా ఆనంద్, కీర్తికా తదితరులు నటించారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. దీపక్ కుమార్ ఛాయాగ్రహణం అందించగా ఆఫ్రో సంగీతం సమకూర్చారు.

ఆదిదంపతుల అర్ధనారీశ్వర రూపం

తిరుచెంగోడు ఆలయంలో అనుగ్రహం

ఆధ్యాత్మికం



ఆలయం పైనుంచి తిరుచెంగోడు విహంగ వీక్షణం



తిరుచెంగోడు పర్వతంపైనున్న అర్ధనారీశ్వరాలయం

నామక్కల్ జిల్లా తిరుచెంగోడు అర్ధనారీశ్వరాలయం కొంగుమండలంలోని సప్త శైవక్షేత్రాలలో ప్రప్రథమమైన ఆలయంగా కీర్తిగడించింది. ఈ క్షేత్రం ప్రాచీన నామధేయం 'తిరుకొడిమాడ సెంగుండ్రర్'. ఈ తిరుచెంగోడును 'అళగియి ఇరైతన్మయ్ పొరుందియ సెన్నీర్ మలై' (అందమైన దైవీక శక్తి కొలువైన అరుణ పర్వతం) అని పిలుస్తారు. సాధారణంగా శివాలయాలలో పరమేశ్వరుడు లింగమేనిగా, శక్తిదేవి ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరి భక్తులను అనుగ్రహించడం ఆనవాయితీ. అయితే తిరుచెంగోడు పర్వతాలయంలో ఆదిదంపతులు అర్ధనారీశ్వర రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తిరుచెంగోడు పర్వతం 6 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కలిగి ఉంది. ఈ పర్వతం రెండు శిఖరాగ్రాలను కలిగి ఉండటం విశేషం. ఈ పర్వతంపైనే అర్ధనారీశ్వరాలయం నిర్మితమైంది. 1901 అడుగుల ఎత్తు కలిగిన పర్వతాన్ని భక్తులు సులువుగా అధిరోహించేందుకు 1200 మెట్లు కలిగిన రహదారి ఉంది. ఇక ఈ ఆలయానికి విప్పచెట్టు స్థలవృక్షంగా ఉంటోంది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

● గిరి ప్రదక్షిణ శైవక్షేత్రం ● వింతరూపాలతో దర్శనమిచ్చే పర్వతక్షేత్రం

స్థలపురాణం..

పరమశివుడి భక్తుడైన భృంగి మహర్షి ఈశ్వరుడిని మినహా మరే దేవతామూర్తులను ఆరాధించని అత్యంత నిష్ఠ కలిగిన మునీశ్వరుడు. పరమేశ్వరుడి పక్కనే ఉన్న ఉమాదేవిని సైతం పట్టించుకోరు. ఆ ఆదిదంపతుల మధ్య మిడత రూపంలో సంచరిస్తూ పరమశివుడిని మాత్రమే పూజించారు. దీంతో పార్వతి దేవి ఆగ్రహించి 'మునీశ్వరా... శక్తి దేవతగా ఉన్న నన్ను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా నీ శక్తినంతా కోల్పోతావు' అంటూ శాపమిచ్చింది. ఆ అమ్మవారి శాపంవల్ల భృంగి మహర్షి శక్తినంతా కోల్పోయి నిలువలేక అలాగే నేలకొరిగాడు. వెంటనే పరమేశ్వరుడు 'మునీశ్వరా శక్తి లేకుంటే శివుడు లేదనే విషయం నీకు తెలియకపోవడం శోచనీయం... శివుడు లేకుండా శక్తి లేదు' అంటూ ఉమాదేవి తన దేహంలో అర్ధభాగాన్ని ఇచ్చి ఆ మునీశ్వరుడి ఎదుట స్వామివారు అర్ధనారీశ్వరుడిగా దర్శనమిచ్చారు. ఆ తర్వాత భృంగి తన తప్పిదాన్ని గ్రహించి ఉమాదేవిని కూడా భక్తిశ్రద్ధలతో పూజించి కోల్పోయిన శక్తినంతా తిరిగి పొందాడు.



సర్వాలంకరణ శోభితంగా దర్శనమిస్తున్న అర్ధనారీశ్వరస్వామి

పర్వత గాథ...

తిరుచెంగోడు పర్వతానికి సంబంధించి ఓ పౌరాణిక గాథ జనబాహుళ్యంలో ప్రచారంలో ఉంది. పూర్వం ఆదిశేషుడికి, వాయుదేవుడికి మధ్య ఇరువురిలో ఎవరు గొప్ప అనే విషయమై వివాదం చెలరేగింది. ఇరువురూ ఓ పందెం వేసుకుంటారు. ఆదిశేషుడు మేరు పర్వతాన్ని తాళ్లతో బంధించినట్లు తన తోకతో ఆ పర్వతాన్ని చుట్టేస్తాడు. వాయుదేవుడిని తన బలంతో తన పట్టును సడలించమంటూ సవాలు విసురుతాడు. వాయు భగవానుడు తన శక్తినంతా ఉపయోగించడంతో ఆదిశేషుడి ఐదు శిరస్సులలో ఒకటి, మేరుపర్వతంలో కొంతభాగం విడిపడి ఒకదానితో ఒకటి బలంగా ఢీకొట్టుకోవడంతో రక్తవర్ణంగా మారి గాలిలో ఎగిరాయి. అందులో కొంత భాగం ఈ క్షేత్రం వద్ద పడి ఎరుపు రంగు కొండగా మారింది. ఆదిశేషుడి శిరస్సు నుంచి కారిన రక్తం ఓ వైపు, మేరు పర్వత భాగం ఆకుపచ్చరంగుతో ఓ అందమైన కొండగా మారి ఈ చోట పడినట్లు పౌరాణిక గాథను బట్టి తెలుస్తోంది. ఆ కారణంగానే ఈ పర్వతం ఆకుపచ్చ, ఎరుపు రంగుతో భక్తులకు కనువిందు చేస్తుంది.

ఆలయ వైభవం...

ఈ ఆలయంలో మూలవిరాట్టు అర్ధనారీశ్వరుడు స్వయంభువుగా ఆవిర్భవించారు. సగభాగం పరమేశ్వరుడి రూపంతో, మరో సగభాగం పార్వతీదేవి రూపంతో 9 అడుగుల ఎత్తు కలిగి మానవాకారంలో స్వామివారు నిలిచిన భంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. మూలవిరాట్టు కుడివైపున పరమేశ్వరుడి రూపంతో, ఎడమవైపున పార్వతదేవీ రూపంతోను అందంగా దర్శనమిస్తున్నారు. మూలవిరాట్టు పాదం వద్ద భృంగి మహర్షి రూపం, శక్తిదేవి పరమేశ్వరుడి అనుగ్రహం కోసం రూపొందించిన మరకతల లింగం కూడా ఉంది. ఆలయ ధ్వజస్తంభం ఎదుట వరాహ మండపం ఉంది. దీన్నే ఆమై అని ఆనంద మండపం అని పిలుస్తున్నారు. ఆ మండపం నేలపై అందమైన కూర్మం(తాబేలు) రూపం చెక్కబడి ఉంది. దాని వీపుపై రథం ఆకారం ఉంది. ఆ రథాకారంపైనే స్వామివారిని (ఉత్సవమూర్తిని) ఉంచి ప్రత్యేక అభిషేకాలు, పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మండపం ముందున్న స్తంభాలపై రతీమన్మథుల రూపాలు అందంగా చెక్కబడి ఉన్నాయి. ఓ వైపున స్తంభంలో మన్మథుడు చెరకువింటిని చేతపట్టుకుని రథంపై నిలిచి ఉండగా, రామచిలుకలు ఆ రథాన్ని లాగుతున్నట్టుగా అందమైన శిల్పం చూపరులకు కనువిందు చేస్తుంది. మరో స్తంభంపై రతీదేవి నిలిచి ఉన్న రథాన్ని రామచిలుకలు లాగుతున్నట్లు మరో అందమైన శిల్పం కూడా ఉంది. ఈ ఆలయంలోని నందీశ్వరుడిని 'కడలై తిండ్ర కల్ నంది' (వేరుశనగలను తిన్న రాతి నంది) అని పిలుస్తారు. శైవభక్త శిఖామణి తిరుజ్ఞాన సంబంధర్ ఈ ఆలయాన్ని దర్శించి పరమేశ్వరుడిని కీర్తిస్తూ గానం చేస్తుండగా ఆ గానానికి పారవశ్యం చెందిన నందీశ్వరుడు ఉన్నట్టుండి లేచి అక్కడ నైవేద్యంగా ఉంచిన వేరుశనగలను ఆబగా ఆరగించినట్లు స్థల పురాణం చెబుతుంది. ఈ కారణంగానే నందీశ్వరుడికి 'కడలై తిండ్ర కల్ నంది' అనే పేరొచ్చింది.



ఆలయ ప్రవేశద్వారంలో వినాయకస్వామి

ఆలయ విశేషాలు..

వధూవరులు తల్లిదండ్రులతో ఈ ఆలయానికి విచ్చేసి అర్ధనారీశ్వరుడిని దర్శించి వెళితే వారి దాంపత్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుందని, మంచి గుణాలు కలిగిన పిల్లలు పుడతారని స్థానిక శైవాగమ పండితులు చెబుతారు. అంతేకాకుండా నాగదోషం, రాహుదోషం, కాలసర్పదోషం, కళత్ర దోషాల బాధితులు ఈ క్షేత్రం వద్ద గిరి ప్రదక్షిణ చేస్తే ఆ దోషాలన్నీ తొలగిపోతాయని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కూడా విముక్తి చెందుతారని చెబుతారు. ఈ ఆలయంలో యేటా చిత్రాపౌర్ణమి, వయ్యాసి విశాఖం, మాశిమఖం, పంగుణి ఉత్తిరం ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

పర్వత విశేషాలు..

తిరుచెంగోడు అర్ధనారీశ్వర పర్వతం 6 కిలోమీటర్ల వ్యాసాన్ని కలిగి ఉంటుంది. ప్రతి నెలా పౌర్ణమి దినాన వేలాదిమంది భక్తులు ఈ గిరి ప్రదక్షిణ చేస్తారు. అర్ధనారీశ్వరుడు, చెంగోడు వేలన్, ఆది కేశవపెరుమాళ్ కూడా ఈ పర్వాతాలయంలోనే కొలువుదీరి ఉన్నారు. తిరుచెంగోడు గిరి ప్రదక్షిణ చేస్తే కైలాసాన్ని, వైకుంఠాన్ని ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలాలు దక్కుతాయని చెబుతారు. ఈ పర్వతాన్ని వాయువ్య దిశ నుంచి వీక్షిస్తే నందీశ్వరుడు ఆశీనభంగిమలో ఉన్న రూపం కనిపిస్తుంది. మరో వైపు నుండి చూస్తే శివలింగాకారంలో, అదే విధంగా పరమత్తి రోడ్డు ప్రాంతం నుంచి అంటే నైరుతి దిశ నుంచి చూస్తే శయన భంగిమలో మహిళా రూపం కనిపిస్తుంది. సానర్పాళయం వైపు నుంచిచూస్తే పడుకున్న జటామునీశ్వరుడి రూపం దర్శనమిస్తుంది. తిరుచెంగోడు పర్వతం అర్ధనారీశ్వర పర్వతం అనడానికి ఈ రూపాలే సాక్షి. ఈ పర్వతంపై దేవ తీర్థం, పాపనాశ తీర్థం, గణపతి తీర్థం, నాగతీర్థం, శివతీర్థం, కుమారతీర్థం అంటూ పలు పుణ్యతీర్థాలున్నాయి.



ఆలయ స్తంభాలపై రతి, మన్మథుల శిల్పాలు - ఆలయ రాజగోపురం



గర్భాలయ విమానం

నాగర్ పల్లం...

ఈ పర్వతంపైకి మెట్లదారిలో వెళుతుండగా రైతుల పశుగణాలను కాపాడే పశువణ్ణసామి (నంది)ఆలయం, ఆ తర్వాత పెద్ద కొండకు, చిన్న కొండకు మధ్య (నందిమలైలో) నాగర్‌పల్లం (నాగ గొయ్యి) ఉంది.ఈ నాగర్ పల్లం ఐదు తలలతో పడగెత్తిన భంగిమలో లింగరూపాన్ని మోస్తున్నట్లు ఆదిశేషుడు 50అడుగుల పొడవుతో కుడ్యశిల్పంగా భక్తులకు కనువిందు చేస్తారు.

సంతాన భాగ్యాన్నిచ్చే పాండీశ్వరుడు...

తిరుచెంగోడు పర్వతంపై అర్ధనారీశ్వరాలయానికి తూర్పుదిశగా రెండు పర్వతాల నడుమ జైనుల లోయ ఉంది. ఇక్కడ జైన మునీశ్వరులు తపమాచరిస్తుండేవారని, పాండవులు వనవాసం చేస్తున్న సందర్భంగా కొద్ది రోజులు ఈ చోట బసచేశారని చెబుతారు. ఈ జైనుల లోయ పక్కనే నిట్టనిలువైన ఎత్తయిన శిఖరం ఉంది. ఆ శిఖరంపై వినాయకుడి ఆలయం, పాండీశ్వరర్ ఆలయం ఉన్నాయి. ఈ శిఖరానికి 'మలడి కల్' (గొడ్రాలి రాయి) అనే పేరుంది. సంతాన భాగ్యానికి నోచుకోని మహిళలు ఇక్కడి పాండీశ్వరర్ ఆలయాన్ని దర్శిస్తే త్వరలోనే ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఎక్కడుందీ ఆలయం?

ఈ ఆలయం సేలం నగరం నుంచి 46 కిలోమీటర్ల దూరంలోను, నామక్కల్ నుంచి 38 కిలోమీటర్ల దూరంలోను, ఈరోడ్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈరోడ్ నగరానికి రాష్ట్ర నలుమూలల నుంచి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. ఈరోడ్ బస్‌స్టేషన్‌లో దిగి ఆటోలు, టౌన్ బస్సులలో తిరుచెంగోడు ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



తిరుజ్ఞాన సంబంధర్, తిరునావుక్కరసర్, సుందరమూర్తి, మాణిక్కవాచగర్ విగ్రహాలు

జూన్ 12న మెట్టూరు డ్యాం నుంచి నీటి విడుదల

● అడిషనల్ చీఫ్ సెక్రటరీ మంగత్ రామ్‌శర్మ



మెట్టూరు డ్యాంను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డెల్టాలోని వ్యవసాయ భూములకు జూన్ 12వ తేదీన మెట్టూరు డ్యాం నుంచి సాగునీటిని ముఖ్యమంత్రి స్టాలిన్ విడుదల చేస్తారని నీటి పారుదల శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ మంగత్ రామ్‌శర్మ పేర్కొన్నారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యాంను గురువారం ఉదయం నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. డ్యాం కుడి, ఎడమ గట్లు, 16 షట్టర్లు, సొరంగం తదితర ప్రాంతాలతో పాటు డ్యాంలో చేపడుతున్న మరమ్మతులను పరిశీలించారు. డ్యాంలోకి చేరుతున్న నీరు, తాగునీటికి విడుదల చేస్తున్న జలాల గురించి తిరుచ్చి జోన్ నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ దయాళ్‌కుమార్ అధికారుల బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంగత్ రామ్‌శర్మ మీడియాతో మాట్లాడుతూ... డ్యాం పూర్తి నీటిసామర్థ్యంతో నిండినా చెక్కుచెదరకుండా ఉండే విధంగా పనులు జరుగుతున్నాయన్నారు.

జెట్ మహిళల ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్యశిబిరంలో జెట్ నిర్వాహకులు

ప్యారీస్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై విభాగం, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో ట్రిప్లికేన్ తాండవరాయన్ వీధిలో ఉన్న అమృత వర్షిణి భవన్‌లో గురువారం మహిళా ఆరోగ్య వికాస్ పేరుతో నిర్వహించిన ఉచిత సెర్వికల్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించింది. 'అమ్మ ఆరోగ్యమే సమాజ సౌభాగ్యం' అన్న లక్ష్యంతో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి 2007వ సంవత్సరం మహిళా ఆరోగ్య వికాస్ ఏర్పాటు చేసి, వికాస తరంగిణి కార్యకర్తల ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో వివిధ ప్రాంతాలు సహా నేపాల్‌లో కూడా ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో మహిళల ఆరోగ్య సమస్యలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన వీఐఏ పరీక్ష జరిపి కాల్పోస్కోప్ ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి చూపించి, అవగాహన కల్పించి, మందులు పంపిణీ చేస్తున్నారు. చెన్నైలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 126 మంది మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అపోలో ఆస్పత్రి వైద్యురాలు మౌనిక, వికాస తరంగిణి కేంద్ర సమన్వయకర్త డాక్టర్ మాధవి రవీంద్ర, ఏపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సౌభాగ్యలక్ష్మి, రత్నమాల, వాణి, జెట్ చెన్నై కో-ఆర్డినేటర్లు మహాలక్ష్మి, పి.కమల, గజలక్ష్మి, సునంద, శారద, జయలక్ష్మి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

'ఐఐటీఎంఐసీ'-'వీఐటీఏపీ' అవగాహన ఒప్పందం

దేశంలో డీప్-టెక్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ బలోపేతం దిశగా చర్యలు

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో డీప్-టెక్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన ముఖ్యమైన చర్యల్లో భాగంగా 'ఐఐటీ మద్రాస్ ఇంక్యుబేషన్ సెల్ (ఐఐటీఎంఐసీ), వీఐటీఏపీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఫౌండేషన్ (వీటీబీఐఎఫ్) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. తద్వారా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వ్యవస్థాపక రంగాన్ని విస్తరించడంలో వ్యూహాత్మక అడుగు పడినట్లయింది. వీఐటీ ఏపీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, డైరెక్టర్లు బి.నాగార్జున, డాక్టర్ అమీత్ చవాన్, ఐఐటీఎంఐసీ ఇన్‌చార్జి, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.మోహనశంకర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ తమస్వతి ఘోష్, చీఫ్ ఇంక్యుబేషన్ ఆఫీసర్ జయ ఉమాదికర్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ఈ ఇంక్యుబేటర్-స్థాయి సహకారం ద్వారా ఐఐటీఎంఐసీ, వీటీబీఐఎఫ్ విద్యా పరిశోధన, విద్యార్థుల నమూనా/వెంచర్ ఆలోచనా కార్యకలాపాల నుంచి ఉద్భవించే డీప్-టెక్ వెంచర్ల ప్రారంభం, స్కేలింగ్‌ను మరింత వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం వీఐటీఏపీలో ఇంక్యుబేట్ చేయబడిన స్టార్టప్‌లు ఐఐటీఎంఐసీలో కో-ఇంక్యుబేషన్/యాక్సిలరేషన్‌ను అన్వేషించడానికి, ఐఐటీ మద్రాస్ డీప్‌టెక్ కమ్యూనిటీకి ప్రాప్యత నుంచి ప్రయోజనం పొందే అవకాశాన్ని కలిగి ఉంటాయి. స్టార్టప్ షోకేస్‌లు, థీమాటిక్ బూట్ క్యాంప్‌లు, టెక్నికల్ బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శిక్షణా కార్యక్రమాలు వంటి ఉమ్మడి కార్యక్రమాలు రెండు రాష్ట్రాల్లో క్రాస్-లెర్నింగ్, ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రోత్సహించడానికి కూడా ప్రణాళిక చేయబడ్డాయి.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

టీటీడీకి విరాళంగా వంద సైకిళ్లు



తిరుమల శ్రీవారికి గురువారం వంద సైకిళ్లు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వీటిని ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు అందజేశారు. ఈకార్యక్రమంలో పేష్కార్ రామకృష్ణ, ఇన్‌చార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో కేంద్రమంత్రి



జ్యుయల్ ఓరం

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి జ్యుయల్ ఓరం, ఎంపీ కేశినేని చిన్ని(శివనాథ్), నిర్మాత అంబిక కృష్ణ, మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'అర్జున్ సన్ఆఫ్ వైజయంతి' బృందం

'అర్జున్ సన్ఆఫ్ వైజయంతి' చిత్ర హీరో కల్యాణ్‌రామ్, దర్శకుడు ప్రదీప్, నటుడు పృద్వీరాజ్, చిత్ర బృందంతో కలిసి విజయశాంతి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఈ సినిమా 18న విడుదల కాబోతోందని, తప్పకుండా రెండు రాష్ట్ర ప్రజలు సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. తమ సినిమాను అందరు తప్పకుండా చూసి ఆదరించాలని హీరో కల్యాణ్‌రామ్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు విజయశాంతి, కల్యాణ్‌రామ్


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,076

తలనీలాలు సమర్పించినవారు: 23,699



● నేడు పెంపుడు జంతువుల దినోత్సవం

పెంచితే పంచేను ప్రేమ





కొసింత దగ్గరకు తీసుకుంటే కొండంత అభిమానాన్ని చూపిస్తాయి. ప్రేమగా సాకితే ప్రాణమే పెడతాయి. తమ చిన్ని పొట్టను నింపితే జీవితాంతం విశ్వాసం చూపిస్తాయి. అందుకే మనలో చాలామంది జంతువులు, పక్షులను పెంచుతుంటారు. వాటితో అనుబంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఆ మూగజీవులతో మమేకమవుతారు. కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరిస్తారు. వాటికేమైనా జరిగితే విలవిల్లాడిపోతారు. తిరుపతిలో ఎక్కువ మంది ఇంట్లో కుక్కలను పెంచుతున్నారు. కుందేళ్లు, ఎలుకలు, పిల్లులే కాదు పలు రకాలు పక్షులనూ సాకుతున్నారు. ఒకరైతే గుర్రాన్ని పెంచుతూ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. వారిలో కొందరిని ఒకసారి పలుకరిస్తే

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)



ఆ పది గుర్రాలే నా లోకం

అశ్వాలే నా లోకం. నా దగ్గర మార్వాడీ జాతికి చెందిన పది గుర్రాలున్నాయి. ఏడాది వయసున్నప్పుడు రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్నాను. ఒకపక్క బిజినెస్ పనులు చేసుకుంటూ గుర్రాలను చూసుకుంటున్నాను. ఒక్కో గుర్రానికి నెలకు రూ20వేలు ఖర్చవుతుంది. భారంగా భావించను. భవిష్యత్తులో గుర్రాలపై పిల్లలకు అవగాహన కల్పించాలనుకుంటున్నాను.

- కార్తీక్, బైరాగిపట్టెడ(తిరుపతి)





పక్షులంటే ప్రాణం

నాకు పక్షులు, కుందేళ్లను పెంచడమంటే ఇష్టం. నా దగ్గర నాలుగు రకాల జాతుల పక్షులు(8 జతలు) ఉన్నాయి. నాలుగు జతల కుందేళ్లున్నాయి. అమాయకంగా అందంగా కనిపించే వీటిని చూస్తే అప్పటివరకు పడిన కష్టాన్ని మర్చిపోతాను. 15 ఏళ్లుగా పెంచుతున్నాను. వీటితో గడపడమంలో చాలా ఆనందాన్ని పొందుతాను. ఒత్తిడి దూరమవుతుంది..

- దుర్గాప్రసాద్, అవిలాల (తిరుపతి)

నాకోసం ఎదురు చూస్తాయి

చిన్నప్పటి నుంచి శనకాలంటే మహా ఇష్టం. ఇంట్లో నాలుగింటిని పెంచుకుంటున్నా. నెల జీతంలో వీటి సంరక్షణకు రూ8వేలు ఖర్చవుతుంది. వాటికి ఇష్టమైన ఆహారం పెట్టి సంతోషడతాను. అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు మందులు వాడుతున్నాను. రోజూ వాటి అవసరాలు చూసుకొని డ్యూటీకి వెళతాను. సాయంత్రం అవి ఎంతో ప్రేమగా నాకోసం ఎదురుచూస్తుంటాయి. దీంతో కష్టాన్ని మరిచిపోతుంటాను.

- శివ, కరకంబాడి(తిరుపతి)

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ



తిరుపతిలో 700 మందికి పైగా పెట్ లవర్స్ ఉన్నారు. అన్ని జాతుల కుక్కలను పెంచకుంటున్నారు. పిల్లులు, కుందేళ్లను పెంచడం తక్కువ. పెట్స్‌కు టీకాల విషయంలో శ్రద్ధ అవసరం. ఎప్పుడు వేయాలో షెడ్యూల్ చేసుకోవాలి. వాటికి అనుగుణమైన ఆహారం ఇవ్వాలి. విశ్రాంతి పొందేలా సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. అవి ఫ్రెండ్లీగా, కుటుంబసభ్యులుగా మారిపోతాయి.

- డాక్టర్ నాగేంద్ర, వెటర్నరీ అధికారి, ఎంసీటీ







పెట్స్ అవసరాలు తీర్చే షాపులు పెరిగాయి

పెట్స్ హాబీ పెరిగేకొద్దీ నగరంలో వాటి అవసరాలకు అనుగుణంగా షాపులు పెరిగాయి. ముఖ్యంగా ఆహారం, మందుల షాపులు వచ్చాయి. 1991లో తిరుపతిలో వెట్‌పార్మా ప్రారంభించాను. తిరుపతిలో 14 నుంచి 15వేల పెట్స్ ఉన్నాయి. కరోనా సమయంలో వీటి సంఖ్య బాగా పెరిగింది. ఆహారానికి సంబంధించి విదేశీ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి. మందులతో పాటు బెల్టులు లాంటి యాక్ససరీస్‌లకు డిమాండు ఉంది.

- ఎం.శ్రీనివాసరావు, వెట్ ఫార్మా ఏజెన్సీస్, తిరుపతి



ప్రత్యేక షాపుల్లో పెట్స్ కోసం ఆటవస్తువులు, స్నాక్స్, తదితరాలు

కలికిరిలో 15న దేశవాళీ విత్తనాల పరిరక్షణ సదస్సు

● హాజరుకానున్న రాయలసీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న అన్నమయ్య జిల్లా కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167)లను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు తుంబురతీర్థ ముక్కోటి

● ఉదయం 5 నుంచి 10 గంటల వరకే అనుమతి

తిరుమల, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్ర, శనివారాల్లో తుంబుర తీర్థ ముక్కోటి జరుగనుంది. ఈ రెండు రోజులూ తీర్థానికి ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. భక్తులకు టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు అందజేయనుంది. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, మందులను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, గుండె, శ్వాసకోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతిలేదని టీటీడీ స్పష్టం చేసింది. ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. ముక్కోటి రోజుల్లో గోగర్భం డ్యాం సర్కిల్ నుంచి పాపవినాశనం డ్యాం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతిలేదని టీటీడీ ప్రకటించింది.

నిఖిత మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో యువతి అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన నిఖిత(17) ఈనెల 4న మృతి చెందడం, ఆగమేఘాలపై కుటుంబ సభ్యులు దహనక్రియలు నిర్వహించడం తెలిసిందే. ఇది పరువు హత్యగా వెలుగులోకి రావడంతో గురువారం మృతురాలి ఎముకలను ఫోరెనిక్స్ బృందం సేకరించింది. ల్యాబ్‌కు పంపింది. ఘటన జరిగిన రోజున మృతురాలి తల్లి సుజాత ఉనికిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులు తనకు విషం పెట్టి చంపేద్దామనికుంటుంటే విన్నానని నిఖిత తన ప్రియుడి అజయ్‌కు వాట్సప్ ద్వారా మెసేజి పంపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన తిరుపతి జిల్లావాసులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 9441456039ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయికి 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'

● తడుకు విద్యార్థుల ప్రతిభ



జేసీ, డీఈవో, జిల్లా సైన్స్ అధికారితో తో తడుకు విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం తడుకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' జాతీయ స్థాయిలో ఎంపికైంది. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గనిర్దేశంలో విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ ఈ ప్రాజెక్టును తయారు చేశారు. వికసిత భారత్- 2047లో భాగంగా సహజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, మౌళిక విద్యా మంత్రిత్వ శాఖ, ఆలిండియా కౌన్సిల్‌ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (ఎస్ఐఎం) పోటీలకు శ్రీకారం చుట్టాయి. 2024 జూలై 29న పోటీలు ప్రారంభంకాగా లక్షలకుపైగా ప్రాజెక్టులు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు అందాయి. వీటిని ఐదు దశల్లో వడపోసి పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. అందులో మన రాష్ట్రం నుంచి రెండు ఉండగా.. అందులో ఒకటి తడుకు విద్యార్థులు రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్టర్. ఈ ప్రాజెక్టుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూ. 90,500 అందించింది. ఈ మొత్తంతో ఈ పరికరాన్ని వ్యాపార పరంగా వినియోగించేలా అభివృద్ధి చేయనున్నారు.

పరికరం.. ఉపయోగాలు

మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయలను సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. వ్యర్థాలను బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరాన్ని రూపొందించిన విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ గురువారం డీఈవో కేవీఎన్ కుమార్, జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను, విద్యాశాఖ అధికారులను అభినందించారు.

అమ్మవారికి కానుకగా బంగారు పట్టీలు





తిరుచానూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి కడప జిల్లాకు చెందిన డాక్టర్ రామస్వామి ఏలుమలై రెడ్డి దంపతులు రూ.10 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు గజ్జెల(పట్టీలు)ను కానుకగా అందజేశారు. గురువారం ఆలయంలో ఏఈవో దేవరాజులుకు వాటిని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

తిరుమలలో డిప్యూటీ స్పీకర్



తిరుమల/రేణిగుంట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు గురువారం తిరుమలకు వచ్చారు. గాయత్రి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రఘురామ కృష్ణరాజు శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన కేసులో విచారణ ఎదుర్కొంటున్న డాక్టర్ ప్రభావతమ్మకు జ్ఞాపక శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థిస్తానని వ్యంగంగా అన్నారు.

అర్ధరాత్రి మారణాయుధాలతో హల్‌చల్

● ప్రత్యర్థులు తప్పించుకోవంతో ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన వైనం ● ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మారణాయుధాలతో పక్కింట్లో ఉంటున్న దంపతులపై దాడికి ప్రయత్నించగా, వారు తప్పించుకుని పారిపోయారు. దీంతో బాధితులు కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడలను కూల్చివేసిన ఘటన బుధవారం అర్థరాత్రి చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు... కొరిడి దళితవాడకు చెందిన కిలివేటి మణి, కిష్టమ్మ కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. వారింటి పక్కనే నివాసం ఉంటున్న కిలివేటి రవిచంద్ర బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తి, గడ్డపారతో మణి ఇంటికెళ్లి నీ భర్త ఎక్కడంటూ కిష్టమ్మ ప్రశ్నిస్తూ హల్‌చల్ చేశాడు. ఒంటరిగా ఉన్న కిష్టమ్మ భయంతో భర్తకు ఫోన్ చేయడంతో మణి ఇంటి వద్దకు చేరుకోగా రవిచంద్ర దాడికి ప్రయత్నించాడు. దీంతో మణి, ఆయన భార్య కిష్టమ్మ తప్పించుకుని పారిపోయారు. దీంతో వారు కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడలను రవిచంద్ర కూల్చివేశాడు. రాత్రి సమయం కావడం, చేతిలో కత్తి, గడ్డపార ఉండడంతో ఇరుగుపొరుగువారు భయంతో మిన్నకుండిపోయారు. ఘటన జరిగిన అనంతరం బాధితులు శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు కొరిడి గ్రామానికి వెళ్లి కూల్చివేసిన ఇంటిని పరిశీలించారు. జరిగిన ఘటనపై కిష్టమ్మ శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే బాధితులు, నిందితుడు బంధువులు పిలిపించి విచారిస్తామని పోలీసులు చెప్పారు.



ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన దృశ్యం

రేపు మాజీ ఉపరాష్ట్రపతి తిరుపతి పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం నుంచి రెండు రోజులపాటు తిరుపతి పర్యటనకు విచ్చేయనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగే 'ఒక దేశం- ఒక ఎన్నిక' సెమినార్‌లో ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం 6 గంటలకు జాతీయ సంస్కృత విద్యాలయంలో జరిగే గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8.20గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

తిరుపతి నుంచి కడప జిల్లాకు వెళ్లే వాహనాల మళ్లింపు

రాయచోటి మీదుగా నడపాలని ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబు వస్తున్న కారణంగా తిరుపతి నుంచి వెళ్లే అన్ని వాహనాలను దారి మళ్లించారు. భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా నడపాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలు జారీ చేశారు. కడప నుంచి తిరుపతికి పీలేరు, భాకరాపేట మీదుగా రావాల్సి ఉంటుందని తెలిపారు. 11వ తేదీ రాత్రి 9 నుంచి 12వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

17న ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ పర్యటన ఏర్పాట్లపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఏర్పాట్లు, ప్రోటోకాల్, బందోబస్తు పగడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఆర్వో నరసింహులు, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.